కాకతీయనే మా విజయానికి మూలం



2



2

ఇందిరమ్మ ఇంటికోసం పాదయాత్ర



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## ప్రభుత్వ కళాశాలలో చేర్చాలని ప్రచారం



**అక్షరటుడే, ఆర్మూర్ :** పదో తరగతి పాసైన విద్యార్థులను ఆర్మూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, మామి డిపల్లి గ్రామంలో అధ్యాపకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు కాలేజీలో ఉన్నాయని వివరించారు. ప్రిన్సిపాల్ సుభాష్ మాట్లాడుతూ విద్యార్థులు నచ్చిన కోర్సులో అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్, నర్సింహ, లక్ష్మణ్, శ్రీనివాస్, రామకృష్ణ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.



## భారీగా ఎస్సైల బదిలీలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 20 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం కీలక పోస్టింగ్‌లో ఉన్న వారిని తప్పించి లూప్‌లైన్‌కు బదిలీ చేశారు. అలాగే లూప్‌లైన్, ఎస్సై-2లుగా కొనసాగుతున్న వారికి ఎస్‌హెచ్‌వోలుగా బాధ్యతలు కట్టబెట్టారు. ఇందల్వాయి ఎస్సై సందీప్‌ను ధర్పల్లి ఎస్సైగా బదిలీ చేశారు. ధర్పల్లి ఎస్సై సామ శ్రీనివాస్‌ను వీఆర్‌కు అటాచ్ చేశారు. వీఆర్‌లో ఉన్న సుమలతకు ఇందల్వాయి ఎస్‌హెచ్‌వో బాధ్యతలు అప్పగించారు. కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్ రెడ్డిని మాక్లూర్‌కు బదిలీ చేశారు. మాక్లూర్‌లో కొనసాగుతున్న ఎస్సై రాజశేఖర్‌ను బోధన్ రూరల్ పీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న మచ్చేందర్‌ను ఎస్‌బీకి అటాచ్ చేశారు. అలాగే వెయిటింగ్‌లో ఉన్న శ్రీనివాస్‌ను కోటగిరి ఎస్సైగా నియమించారు. కోటగిరిలో ఉన్న సునీల్‌ను ఐదో టౌన్ ఎస్సై-1గా పంపించారు. వీఆర్‌లో వినయ్‌ను నందిపేట ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. ప్రస్తుతం నందిపేట ఎస్‌హెచ్‌వోగా ఉన్న శ్యాంరాజ్‌ను వీఆర్‌కు అటాచ్ చేశారు. జగిత్యాల ఎస్‌బీలో ఉన్న సతీశ్‌ను కమ్మర్‌పల్లి ఎస్‌హెచ్‌వోగా నియమించారు. వీఆర్‌లో ఉన్న మనోజ్ కుమార్‌ను రుద్రూర్ ఎస్సైగా బదిలీ చేశారు. రుద్రూర్‌లో ఉన్న సాయన్నను వీఆర్‌కు పంపించారు. ఐదో టౌన్ ఎస్సై-1 గంగాధర్‌ను రెంజల్ పీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. వీఆర్‌లో యాదగిరిని ఆరో టౌన్ ఎస్సైగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న వెంకట్ రావును సీటీసీ పంపించారు. వీఆర్‌లో ఉన్న సందీప్‌ను టూటౌన్ ఎస్సై-1గా నియమించారు. రెండో టౌన్‌లో ఉన్న సయ్యద్ ముజాహిద్‌ను ఎస్‌బీకి బదిలీ చేశారు. సీసీఎస్‌లో ఉన్న చంద్రమోహన్‌ను సీసీఆర్‌బీకి పంపించారు. వీఆర్‌లో ఉన్న టి.గోవింద్‌ను సీఎస్‌బీకి బదిలీ చేశారు.



# ఖరీఫ్ సాగుకు సన్నద్ధం!

**ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సన్నద్ధం అవుతున్నారు. తొలకరి పలకరింపుతోనే సాగు ప్రారంభించేందుకు సమాయత్తం అవుతున్నారు. సాగు కోసం ముందుగానే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను అందుబాటులో ఉంచారు.** **- అక్షరటుడే, ఎల్లారెడ్డి**

- ఎరువుల విత్తనాల కోసం రైతుల పరుగులు
- పెరిగిన ఎరువుల ధరలతో ఇబ్బందులు
- అందుబాటులో 3.20 లక్షల క్వింటాళ్ల విత్తనాలు
- ఇంకా పూర్తి కాని ధాన్యం కొనుగోళ్లు

మరికొద్ది రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలంగాణను తాకనున్నాయి. దీంతో వానాకాలం సాగు కోసం రైతన్నలు ప్రణాళికలు రచిస్తున్నారు. కొందరు ఇప్పటికే తుకాలు పోయగా.. మరికొందరు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులను సైతం ముందుగానే కొనుగోలు చేసి పెట్టుకుంటున్నారు. యూరియా యాప్ ద్వారా విక్రయించనుండటంతో కాంప్లెక్స్ ఎరువుల కోసం పరుగులు పెడుతున్నారు. వాటి ధరలు భారీగా పెరగడంతో ఇబ్బంది పడుతున్నారు.

### ఖరీఫ్ సాగు అంచనాలు

జిల్లాలో వానాకాలం సాగు కోసం 3.20 లక్షల క్వింటాళ్లు విత్తనాలు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం 3.82 లక్షల క్వింటాళ్ల స్టాక్ అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. 90,084 మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరం కాగా, 1.16 లక్షల మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వానాకాలంలో మొత్తం 5.58 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు.

### వ్యవసాయ అధికారుల సూచనలు

విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తగినంత స్టాక్ ఉంచినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతులు నిర్ణీత సమయంలోనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. మోతాదుకు మించి ఎరువులు కొనుగోలు చేయొద్దని, నిల్వ చేసుకోవద్దని కోరారు. ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు అమ్మితే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న డీలర్ల దగ్గరే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని అధికారులు సూచించారు. రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. విత్తనాలను శుద్ధి చేశాకే నాటాలి.



## వినాయక్‌నగర్‌లో పింఛన్ లైవ్ అథెంటికేషన్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** చేయూత పెన్షన్ల విషయంలో రాష్ట్రంలో భారీ ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. మృతి చెందిన వారి పింఛన్లు తొలగించడానికి లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ ప్రారంభించింది. చేయూత లబ్ధిదారులు తాము జీవించే ఉన్నామని వేలిముద్ర, ముఖ గుర్తింపు ద్వారా నిరూపించుకోవాలి. ఈ మేరకు నగరంలోని వినాయక నగర్ ప్రాంతంలో మున్నూరు కాపు సంఘంలో లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. కాలనీలో పింఛన్ పొందుతున్న వారు వచ్చి లైవ్ అథెంటికేషన్ చేయించుకోవాలని 45వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్ కోరారు. వార్డు ఆఫీసర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం ప్రారంభిస్తోందని డీఐఈవో రవికుమార్ తెలిపారు. ఇందులో భాగంగా నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోనూ ఈ నెల 12న ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. కళాశాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బుద్ధిరాజు అధ్యక్షతన కళాశాల అధ్యాపక, అధ్యాపకేతరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం కార్యక్రమంతో విద్యార్థినులకు ప్రయోజనం కలుగుతుందన్నారు.



## వంతెనల నిర్మాణాలకు రూ. 8.50 కోట్ల నిధులు మంజూరు

**అక్షరటుడే, లింగంపేట:** మండలం లోని లింగంపల్లి కుర్దు సమీపంలోని కేకేవై రహదారిపై పాములాగు వంతెన నిర్మాణానికి, ఎల్లారెడ్డి మండలం అడవి లింగాల్ వంతెనకు ప్రభుత్వం రూ. 8.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో లింగంపేట కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## ముందు మీ రాజధాని సంగతి చూసుకో.. పవన్‌కు వేముల కౌంటర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు వేముల కౌంటర్ ఇచ్చారు. మాటలు జారితే, ఎలా సమాధానం ఇవ్వాలో తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. పవన్ కల్యాణ్ పోటీ చేస్తే పోయేది ఏమి లేదని పేర్కొన్నారు. ముందు మీ రాష్ట్రం పునర్నిర్మాణం చేసుకో, రాజధాని లేదు, సెక్రటేరియట్ ఆ నిర్మాణాల సంగతి చూడని ఎద్దేవా చేశారు. తెలంగాణ వ్యతిరేక శక్తులు ఏకం అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కుంభకోణాల ప్రభుత్వం నడుస్తుందని వేముల ఆరోపించారు. రైతు డిస్కం పేరుతో విద్యుత్ శాఖ ను ప్రైవేట్ పరం చేసే కుట్రలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు హైదరాబాద్‌లో భూకబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదును ఉద్యమంలా నిర్వహించాలన్నారు. అభివృద్ధి చేస్తానని చెప్పి అన్ని విధాల నిజామాబాద్ నగరాన్ని చెత్తకుప్పలా తయారుచేసిన ఎమ్మెల్యే ధన్‌పాల్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న కార్యక్రమంలో పార్టీ బూత్ ఏజెంట్లు, బూత్ ఇంచార్జులు అత్యంత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ఓటరు జాబితాల్లో ఎలాంటి లోపాలు, పొరపాట్లు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని కోరారు.



మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన నుంచి రాష్ట్ర అభివృద్ధి వరకు బీఆర్ఎస్ చేసిన కృషిని ప్రజలు ఎన్నటికీ మరచిపోరని అన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన పార్టీగా చరిత్రలో నిలిచిపోయిందని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు విజయవంతం చేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ... సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని ప్రతి ఇంటిని సంప్రదించాలని సూచించారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే మాట్లాడుతూ... బూత్ కమిటీలు బలంగా ఉంటేనే పార్టీ బలపడుతుందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దండు నీతు కిరణ్ శేఖర్, సిర్ప రాజు, ప్రభాకర్ రెడ్డి, సత్యప్రకాష్, సుజిత్ సింగ్, నవీద్ ఇక్బాల్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.



## నిజామాబాద్ జీజీహెచ్‌లో తొలి ప్లాస్టిక్ సర్జరీ విజయవంతం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తొలి ప్లాస్టిక్ సర్జరీ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు సూపరింటెండెంట్ నాగమోహన్ తెలిపారు. గాంధారి మండలానికి చెందిన లచ్చవ్వ (45) అనే రోగికి ముఖం ఎడమ చెంప భాగంలో వ్యాధి నిర్ధారణ కావడంతో, ప్లాస్టిక్ సర్జన్ డా. శివాని ఆధ్వర్యంలో రోటేషన్ ఫ్లాప్ రీ కన్‌స్ట్రక్షన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ ఆపరేషన్ హెచ్‌వోడీ విజయ్ కుమార్ పర్యవేక్షణలో జరిగింది. శస్త్రచికిత్స అనంతరం రోగి కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు. నిజామాబాద్ కు చెందిన మమత అనే మహిళకు కాలి భాగంలో దీర్ఘకాలంగా మానని గాయం ఉంది. జీజీహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్లాస్టిక్ సర్జన్ శివాని రోగికి ఫ్లాప్ కవర్, స్ప్లిట్ తిక్‌నెస్ స్కిన్ గ్రాఫ్టింగ్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స విభాగాధిపతి విజయ్ కుమార్ పర్యవేక్షణలో జరిగింది. ఈ చికిత్స ద్వారా రోగి కాలును సంరక్షించడంతో పాటు, సాధారణ జీవన విధానానికి తిరిగి చేరుకునే అవకాశం కలిగిందని పేర్కొన్నారు.

## గ్రామ, వార్డు సభలను సమర్ధవంతంగా నిర్వహించాలి

**అక్షరటుడే, ఇందూరు:** గ్రామ, వార్డు సభలను సమర్ధవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు దిశానిర్దేశం ఆదేశించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ సభలు, వార్డు సభల నిర్వహణకు సంబంధించి కలెక్టరేట్ లో బుధవారం సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 4, 6, 8, 10వ తేదీల్లో గ్రామ, వార్డు సభలను పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యేలా ప్రణాళికాబద్దంగా కృషి చేయాలని అదనపు కలెక్టర్లు సూచించారు. సభ నిర్వహణకు ఒకరోజు ముందే టాంటాం ద్వారా, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు ముందస్తుగానే సమాచారం తెలియజేయాలని తెలిపారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న 'ఎస్.ఐ.ఆర్' ప్రక్రియ గురించి సభలలో ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎస్.ఐ.ఆర్ అమలులో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర క్రియాశీలకం అయినందున రాజకీయ పార్టీలు సత్వరమే బీఎల్ఏలను నియమించుకోవాలని అదనపు కలెక్టర్లు సూచించారు. నిర్దేశిత నమూనాలో జాబితాను సమర్పించేలా ప్రజాప్రతినిధులను కోరాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు, విత్తనాలు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన దరిమిలా పంటల మార్పిడి ఆవశ్యకత గురించి రైతులకు తెలియజేయాలన్నారు. పచ్చదనం



పెంపొందించేందుకు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన ఆవశ్యకతను వివరించాలన్నారు. ప్రకృతి సమతుల్యత కోసం అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని చెప్పారు.సమావేశంలో అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఆర్ఓ గీత, డీఎఫ్‌వో సిద్దార్థ్ విక్రమ్ సింగ్, డీఆర్డీవో సాయన్న, జెడ్పీ సీఈవో సాయగౌడ్, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్, బోధన్ ఆర్డీవోలు రాజేంద్రకుమార్, విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బోధన్ మున్సిపాలిటీలో ఆధిపత్య పోరు.. షాడో ఛైర్మన్ వర్సెస్ కౌన్సిలర్లు

**అక్షరటుడే: బోధన్ :** బోధన్ మున్సిపాలిటీ లో ఛైర్‌పర్సన్, కౌన్సిలర్ల మధ్య గొడవలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నంత విభేదాలు చేరుకున్నాయి. బోధన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా తూము పద్మ, వైస్ ఛైర్మన్‌గా ఎంఐఎం పార్టీ కి చెందిన మీరు ఇలియాస్ అలీ ఉన్నారు. అయితే ఛైర్‌పర్సన్ భర్త శరత్ రెడ్డి కూడా కౌన్సిలర్‌గా గెలుపొంది ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరిస్తున్నారు. శరత్ రెడ్డి షాడో ఛైర్మన్‌గా అన్ని తానై వ్యవహరిస్తుండటంతో.. ప్రతిపక్ష కౌన్సిలర్లకు శరత్ రెడ్డికి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. అధికార పార్టీ కార్యక్రమాలకు ప్రతిపక్ష కౌన్సిలర్లను ఆహ్వానించడం లేదంటూ కనీసం తమను కౌన్సిలర్లుగా గుర్తించడం లేదంటూ ప్రతిపక్ష కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన బక్రీద్ సందర్భంగా పారిశుధ్య కార్మికులను మున్సిపాలిటీలో సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి అధికార పార్టీ కౌన్సిలర్లు తప్ప ప్రతిపక్షాలను పిలువ లేదంటూ ఎంఐఎం, బీజేపీ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై 11వ వార్డు బీజేపీ కౌన్సిలర్ భర్త కొల్లిపాక బాలరాజ్ శరత్ రెడ్డిని ప్రశ్నించడంతో వారి మధ్య వాగ్ వివాదం మొదలైంది. ఒకరిపై ఒకరు దాడి చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. శరత్‌రెడ్డి ఒంటెద్దు పోకడలతో ముందుకు వెళ్తున్నారని ప్రతిపక్ష కౌన్సిలర్లు




ఆరోపిస్తున్నారు.తమను కూడా ప్రజలు ఓటు వేసి గెలిపించాలని, కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వర్సెస్ ఎంఐఎం పార్టీ గొడవలు బోధన్ మున్సిపాలిటీలో తారాస్థాయికి చేరుకున్నాయి. వైస్ ఛైర్మన్‌కు మున్సిపాలిటీలో ప్రత్యేక గది కేటాయించాలని ఎంఐఎం పార్టీ అడుగుతుంటే సాధ్యం కాదని అధికార పార్టీ చెబుతుంది. దీంతో వారి మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ శరత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉందని, అధికార కార్యక్రమాలకు కూడా తమకు ఆహ్వానం ఉండడం లేదని ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు అంటున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను అభినందించిన ప్రజాప్రతినిధులు



**అక్షరటుడే, ముప్కాల్:** ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో భాగంగా వేంపల్లి గ్రామంలో బుధవారం లబ్ధిదారుల ఇళ్లను గ్రామ ప్రజాప్రతినిధులు సందర్శించారు. సర్పంచ్ మహేష్ యాదవ్, ఉప సర్పంచ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు లబ్ధిదారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతోందని వారు పేర్కొన్నారు.

## బాల్కొండలో గ్రామసభ



**అక్షరటుడే, బాల్కొండ :** విద్యాశాఖ చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బాల్కొండ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ.. బడీడు పిల్లలందరిని పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు అందిస్తున్నట్లు తెలిపారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గంగారాం, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముప్కాల్‌లో యువకుడి ఆత్మహత్య

**అక్షరటుడే, ముప్కాల్:** మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ముప్కాల్‌కు చెందిన ఆయూబ్ (35) తన నివాసంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు సమాచారం.



■ జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్ల మనోగతం

**కృషి ఉంటే లభించని విజయం లేదు.. సరైన మార్గదర్శకత్వం తోడైతే సాధించలేని శిఖరం లేదని నిరూపించారు నిజామాబాద్ కాకతీయ విద్యాసంస్థల విద్యార్థులు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 ఫలితాలలో కాకతీయ ఐఐటీ/నీట్ అకాడమీ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి, ఇటు విద్యాసంస్థకు, అటు నిజామాబాద్ జిల్లాకు జాతీయ స్థాయిలో ఘన కీర్తిని చేకూర్చారు.**

**- అక్షరటుడే, ఇందూరు**

# కాకతీయనే మా విజయానికి మూలం..

స్కూలు స్థాయి నుంచే బలమైన పునాది, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రణాళికతో బోధన అందించడం వల్ల విద్యార్థులు తమ మొదటి ప్రయత్నంలోనే ఈ ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారని సంస్థ ఛైర్‌పర్సన్ సి.హెచ్. విజయలక్ష్మి, డైరెక్టర్, ఐఐటియన్ సీహెచ్.రామోజీరావు ప్రకటించారు. జాతీయ స్థాయిలో ర్యాంకులు సొంతం చేసుకున్న సందర్భంగా విద్యార్థులు తమ మనోభావాలను 'అక్షరటుడే'తో పంచుకున్నారు. తమ విజయానికి మూలం కాకతీయ విద్యా సంస్థలనేనని పేర్కొంటున్నారు. వివరాలు వారి మాటల్లోనే..

### స్కూల్‌స్థాయి ఫౌండేషనే విజయ రహస్యం: డైరెక్టర్

ఈ ఘన విజయంపై కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్.రామోజీరావు మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్‌లో ఆత్రుత పడితే జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో రాణించలేరని, స్కూలు స్థాయి నుంచే ఐఐటీ ఫౌండేషన్ ఉదయం రెగ్యులర్ సిలబస్‌తో పాటు, మధ్యాహ్నం ప్రతిరోజు కాలేజీ స్థాయి లెక్చరర్లతో శిక్షణ ఇప్పించడం వల్లే ఇలాంటి ఉన్నతమైన ర్యాంకులు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. అందుకే తల్లిదండ్రులు స్కూలు స్థాయిలోనే త్వరపడాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ సి.హెచ్. తేజస్విని ప్రత్యేకంగా అభినందించారు. ఈ అద్భుతమైన ఫలితాలు వేరే ఏ జిల్లాలోనో, వేరే బ్రాంచ్‌లలోనో సాధించినవి కావు.. కేవలం మన నిజామాబాద్ కాకతీయ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు సాధించిన మార్కులు మాత్రమేననే విషయాన్ని జిల్లా తల్లిదండ్రులు గమనించాలని యాజమాన్యం సూచించింది.

### గురువుల నిరంతర శ్రమే ఈ ర్యాంక్ – బి. సంధ్య



"మొదటి ప్రయత్నంలోనే 1627 ఆలిండియా ర్యాంక్ సాధించడం చాలా సంతోషంగా ఉంది. నాకు ఇంతటి ర్యాంకు రావడానికి కారణం మా ఉపాధ్యాయుల నిరంతర కృషి, అలాగే నా తల్లిదండ్రుల పూర్తి సహాయ సహకారాలు అందించారు. మా కళాశాల డైరెక్టర్ సీహెచ్.రామోజీరావు మాకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ కౌన్సెలింగ్ ఇచ్చి ప్రోత్సహించారు. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గా ఉన్నతస్థాయిలో స్థిరపడతా."

### మొదటి ప్రయత్నంలోనే అద్భుత ర్యాంక్ – హెచ్. భరత్



"ఇంటర్మీడియట్ చదువుతూ, మొదటి ప్రయత్నంలోనే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 1275 ఆలిండియా ర్యాంక్ సాధించడం చాలా ఆనందంగా ఉంది. ఇంతటి అద్భుతమైన ర్యాంకు సాధించడానికి కాకతీయ కళాశాల డైరెక్టర్ సీహెచ్.రామోజీరావు సర్ అన్ని వేళలా అందుబాటులో ఉండి కౌన్సిలింగ్ ఇవ్వడమే కారణం. కాకతీయ అధ్యాపక బృందం అందించిన అద్భుతమైన కోచింగ్ వల్లే నేను ఈ రోజు ఈ స్థాయిలో నిలబడగలిగాను. భవిష్యత్తులో టాప్ ఐఐటీ లో సీఎస్ఈ (సీఎస్ఈ) గ్రూప్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవ్వాలన్నదే నా లక్ష్యం."

### ప్రణాళికాబద్ధమైన చదువే గెలిపించింది – జె. తన్విత



"జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో నాకు 1573 ఆలిండియా ర్యాంక్ రావడం ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. నేను ప్రతిరోజూ ఎంతో ప్రణాళికాబద్ధంగా చదివేదాన్ని. ఐఐటియన్ అయిన మా డైరెక్టర్ Ch. రామోజీరావు సర్ ఎప్పటికప్పుడు నిర్వహించిన పరీక్ష ఫలితాలను సమీక్షించి, నాకు ఎన్నో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు. నా సొంత అనుభవంతో చెబుతున్నాను.. జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో రాణించాలంటే పాఠశాల స్థాయి నుంచే ఐఐటీ ఫౌండేషన్ బోధించే పాఠశాలలు ఎంతో దోహదపడతాయి."

### పునాది వేసింది కాకతీయ ఒలింపియాడ్ స్కూలే – ఎ. అత్రిజ్



"నేను స్కూలు స్థాయిలో లో చదివాను. అక్కడ కేవోఎస్‌లో ఐఐటీ/మెడికల్ ఫౌండేషన్ శిక్షణ ప్రతిరోజు, ప్రతి సబ్జెక్టుపై ఇంటర్ - ఎంసెట్ స్థాయి లెక్చరర్లతో మా డైరెక్టర్ సీహెచ్ రామోజీరావు, సీహెచ్.తేజస్విని పర్యవేక్షణలో ప్రణాళికాబద్ధంగా అమలయ్యేది. ఆ బలమైన ఫౌండేషన్ వల్లే ఇంటర్మీడియట్‌లో ఈ రోజు ఇంతటి అద్భుతమైన జాతీయ స్థాయి ర్యాంకు సాధించగలిగాను. విద్యార్థులు జాతీయ పరీక్షల్లో రాణించాలంటే స్కూలు స్థాయి నుంచే ఇంటర్, ఎంసెట్ స్థాయి లెక్చరర్లతో శిక్షణ ఇచ్చే పాఠశాలల్లో చేరాలి. మా కేవోఎస్ నా విజయానికి వందశాతం పునాది."

## 7న మున్నూరు కాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** తెలంగాణ మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నిజామాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7న ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు అధ్యక్షుడు తోట రాజశేఖర్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఈఏపీసెట్, జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రతియేటా పురస్కారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా జిల్లా కేంద్రంలోని ప్రగతి నగర్ మున్నూరు కాపు కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 11 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇప్పటికీ పలువురు విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని రాజశేఖర్ తెలిపారు. చదువుతో పాటు ఈ ఏడాది క్రీడా రంగంలో సత్తా చాటిన వారిని కూడా సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం 202526 లో క్రీడల్లో జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన వారు తమ వివరాలను వెంటనే జిల్లా కమిటీకి అందజేయాలని కోరారు. ఇప్పటికీ పేరు నమోదు చేసుకున్న విద్యార్థులు కార్యక్రమానికి తమ తల్లిదండ్రులతో హాజరు కావాలన్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు తోట రాజశేఖర్ పటేల్, ప్రధాన కార్యదర్శి రవీందర్ పటేల్ అబ్బాపూర్, కోశాధికారి బాశెట్టి సురేష్ కుమార్ పటేల్ ప్రకటన విడుదల చేశారు.

## ఇందిరమ్మ ఇల్లు కోసం కలెక్టరేట్‌కు పాదయాత్ర..



**అక్షరటుడే, కామారెడ్డి:** 'నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. అందరితో పాటు నా పేరు కూడా లిస్టులో వచ్చింది. అయితే ఎంపీవో లాగిన్‌లో నా అప్లికేషన్‌లో నా నంబర్ లేదని అధికారులు చెబుతున్నారు. అప్లికేషన్ స్టేటస్ మాత్రం కలెక్టర్ అప్రూవల్ కోసం పెండింగ్ ఉందని చూపిస్తోంది. మాకు ఇల్లు లేదు. మా అమ్మకు ఒకటే కిడ్నీ ఉంది. ఆమె పేషంట్. మాకు ఇల్లు ఇప్పించాలి' అంటూ ఇందిరమ్మ ఇంటి బాధిత కుటుంబం కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టింది. విషయం తెలుసుకున్న అడిషనల్ కలెక్టర్ కారులో బాధితులకు ఎదురెళ్లి కారులో ఎక్కించుకుని ఎంపీడీవో కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం బాధితులకు ఇల్లు మంజూరు పత్రం అందజేసి ఇంటి నిర్మాణానికి అధికారులు ముగ్గు పోశారు. ఈ ఘటన బీబీపేట మండలంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎల్లమైన నందినికి గ్రామంలో 18 మందితో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జాబితాలో పేరు వచ్చింది. అయితే ఇంటి నిర్మాణం చేసుకోవడానికి మంజూరు పత్రం రాలేదు. అధికారులను అడిగితే ఎంపీడీవో లాగిన్‌లో పేరు లేదని చెప్పారు. అప్లికేషన్ స్టేటస్ మాత్రం కలెక్టర్ పెండింగ్ ఉన్నట్టుగా కనిపించింది. దాంతో సదరు లబ్ధిదారులు బీబీపేట నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్రగా బయలుదేరారు. జనగామ వద్దకు రాగానే విషయం తెలుసుకున్న అడిషనల్ కలెక్టర్ గిరి బాధితుల వద్దకు వెళ్లి వారిని కారులో ఎక్కించుకుని ఎంపీడీవో కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడికక్కడే ఇంటి మంజూరు పత్రం రెడీ చేసి ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేయాలని చెప్పారని బాధితులు తెలిపారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం మండల కార్యవర్గం



**అక్షరటుడే, లింగంపేట:** విశ్వబ్రాహ్మణ సంఘం లింగంపేట మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కమ్మరి సిద్ధిరాములుచారి, ఉపాధ్యక్షులుగా కమ్మరి వెంకటి చారి, వడ్ల రాజు చారి, ప్రధాన కార్యదర్శిగా అవుసుల లక్ష్మణ్ చారి, కోశాధికారిగా వడ్ల రాజేందర్ చారి, కార్యదర్శిగా అవుసుల శ్రీనివాస్ చారి లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అన్ని రంగాల్లో విశ్వబ్రాహ్మణులు ముందు ఉండేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం విశ్వకర్మ ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్ల భీమయ్య చారి, వడ్ల రవికుమార్ చారి, కుమ్మరి వెంకటేశం చారి, పండరి చారి, మురళి చారి, నరహరి చారి, చంద్రశేఖర్ చారి, బ్రహ్మం చారి, ప్రభాకర్ చారి, సతీష్ చారి, గంగయ్య చారి తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నిరోధానికి సమిష్టిగా కృషి చేయాలి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం అదనపు కలెక్టర్ అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, ఇకపై అవలంభించాల్సిన విధానాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలంను కట్టడి చేసేందుకు గట్టి నిఘా ఉంచాలన్నారు. క్లోరోఫాం, డైజోఫాం, ఆల్ప్రాజోలం వంటి వాటిని వినియోగిస్తూ తయారు చేసిన కల్తీ కల్లు సేవిస్తుండడం వల్ల అనేక మంది అనారోగ్యాల బారిన పడుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఎవరు కూడా కల్తీ కల్లు బారిన పడకుండా గ్రామగ్రామాన అవగాహన కల్పించాలని సూచించారు. నిరంతర దాడులు కొనసాగిస్తూనే, మత్తు పదార్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం చేస్తూ పూర్తి స్థాయిలో అవి పని చేసేలా చూడాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, జిల్లా ఔషధ నియంత్రణ అధికారిణి శ్రీలత, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత, గిరిజన జర్నలిస్టుల రక్షణే లక్ష్యం : కాదేపురం గంగన్న



**అక్షరటుడే, కోటగిరి :** రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టుల రక్షణతో పాటు వారి అభివృద్ధి, సంక్షేమమే తమ సంకల్పమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాదేపురం గంగన్న అన్నారు. కోటగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉమ్మడి కోటగిరి, మండలాల్లోని దళిత జర్నలిస్టులతో కలిసి ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు.ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా పనిచేస్తూ, సమాజానికి మూల స్థంభమైన జర్నలిస్టులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్రిడిటేషన్ల విషయంలో న్యాయం చేయాలని కోరారు. చిన్న పత్రికలు, పెద్ద పత్రికలు అనే తేడా చూపకుండా ఆయా పత్రికలలో పని చేసే ప్రతీ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ అందించాలన్నారు. అదేవిదంగా హెల్త్ కార్డులు, జర్నలిస్టుల పిల్లల చదువులో పూర్తి శాతం రాయితీ కల్పించాలని కోరారు. ప్రతీ జర్నలిస్టుకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజన జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రత్యేక రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే నిజామాబాద్ జిల్లాలో ఉన్న దళిత, గిరిజన జర్నలిస్టులను ఏకం చేసి జిల్లా ప్రథమ మహాసభను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బేగరి రాములు, రాము, భీంరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



**అక్షరటుడే, కామారెడ్డి :** నాలుగు రోజుల క్రితం కూలి పని కోసం భర్తతో కలిసి వెళ్లిన మహిళ విగతజీవిగా కనిపించింది. ఈ ఘటన కామారెడ్డి పట్టణ శివారులో బుధవారం వెలుగు చూసింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం పోతారం గ్రామానికి చెందిన నర్సాపురం శ్యామల(40) భర్త రాజంతో కలిసి ఆదివారం కామారెడ్డిలో కూలీ పనికి వచ్చింది. అయితే రాజంకు పని దొరికి శ్యామలకు దొరకలేదు. దీంతో కూరగాయలు తీసుకుని ఇంటికి వెళ్లాలని చెప్పి ఆయన పనికి వెళ్లాడు. అయితే రాత్రి అయినా ఆమె ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే శ్యామల ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది. కామారెడ్డిలో వెతకగా ఆచూకీ లభించలేదు. దీంతో శ్యామల కనిపించడం లేదని కుటుంబ సభ్యులు సోమవారం కామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం టర్నింగ్ వద్ద కలెక్టరేట్ వెళ్లే దారిలో రైల్వే ట్రాక్ పక్కన కుళ్లిపోయిన స్థితిలో మహిళ మృతదేహం కనిపించింది. దానిని శ్యామల మృతదేహంగా గుర్తించారు. డీఎస్పీ మధుసూదన్, పట్టణ సీఐ నరహరి, దేవునిపల్లి ఎస్సై రంజిత్ కుమార్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి పంచనామా చేశారు. మృతదేహం రోడ్డు, రైల్వే ట్రాక్ పక్కన చెట్టు మొదటన కనిపించకుండా ఉండటంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మహిళ హత్యకు గురైందా..? లేక ఇతర ప్రమాదం ఏదైనా జరిగి ఉంటుందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.